# తప్పు

— కాకాని కమల



"అవును. అతను ముమ్మాటికి సంస్కారవంతుడే" అంది సరిత మొండిగా. భర్తకి ఎదురు సమాధానం చెపుతున్నట్లు.

"ఛట్ నోర్మూయ్. వాడు సంస్కారవంతుడా? వట్టి రోగ్. నువ్వు వాడు ఎంత చిన్ననాటి స్నేహితులు, క్లాస్‌మేట్స్ అయితేమాత్రం ఇప్పుడు నీకు పెళ్ళి అయ్యింది. బిడ్డ తల్లివి. భర్త ఇంట్లో లేని సమయం చూసి నీకోసం నిత్యం వాడు రావటం, వాడితో నువ్వు ఇకఇకలు పకపకలు. ఇది సంస్కారమా?"

సరిత పొగరుగా తల ఎగరేసింది.

"ఏం? ఎందుకు కాదు? మీ స్నేహితుడు సత్యమూర్తి చనిపోయాడు. అతని భార్య ఒంటరిది అయ్యింది. దుఃఖంతో ఉంది. స్నేహితుడి భార్యని ఆదుకోవటం ధర్మం అంటూ మీరు పగలు రాత్రి ఆ సత్యనారాయణ ఇంట్లోనే ఉంటున్నారు కదా? ఆవిడ మనసుకి సంతోషం కావాలంటు పగలు రాత్రి స్కూటర్ మీద తిప్పుతున్నారు? 'నువ్వేకావాలి' సినిమాకి తీసుకెళ్ళమని, లుంబిని పార్క్‌కి తీసుకెళ్ళమని నేను పాప ఎన్నో సార్లు అడిగాం? వీలు కుదరదు, బిజీపన్లు ఉన్నాయి అన్న మీరు, ఆమెని 'నువ్వేకావాలి' సినిమాకి మొదట ఆటకి టిక్కెట్లు దొరకలేదని, రెండో ఆటకి తీసుకెళ్ళారు. ఆ రాత్రి రెండింటికి ఇంటికి వచ్చారు. భోజనం వాళ్ళింట్లోనే తిన్నారు. మీ ఇద్దరూ ఫిల్మ్‌సిటీకి వెళ్ళారని, మాదాపూర్‌లో కనిపించారని ఎవరో చెపితే నాకు తెలిసింది. మీరు ఆవిడతో కలిసి వెళ్ళారు. కనీసం నాకు చెప్పలేదు. అదేమంటే ఆవిడ దుఃఖంలో వుంది ఆదుకోవాలి. లేకపోతే ఏదన్న అఘాయిత్యం చేస్తుంది అన్నారు ఒకసారి. భర్తపోయిన కొత్తలో బొట్టు పూలు తీసేసింది. ఇప్పుడు బొట్టు పూలు పెట్టుకుంటోంది. అది తప్పు అని నేను అనను. కాని ఆవిడలో అంత మార్పుకి మీ చేయూత, స్నేహ సహకారం అని నాకు తెలుసు" అంది కళ్ళెగరేస్తూ సరిత.

"ఏం తప్పా? సాటి ఆడదాన్ని చూసి ఏడుస్తున్నావా? దుఃఖంలో కష్టంలో ఉన్న స్నేహితుని భార్యకి ఓదార్పునివ్వటం కాస్త సహాయపడటం తప్పు కాదే?" అరుస్తున్నట్లు అన్నాడు గౌరీనాథ్.

"అవును తప్పుకాదు. కానీ మీరు ఒక విషయం మర్చిపోతున్నారు. మీ స్నేహితుడు చనిపోయి ఏడాది దాటి ఆరు నెల్లు అయ్యింది. భర్త ఉద్యోగం ఆవిడకి ఇచ్చారు. ఇప్పుడు ఆవిడ హాయిగా ఉంది. బాగా కోలుకొని నిలదొక్కుకుంది. ఆమె జీవితం ఒక కొలిక్కి వచ్చింది. భర్త పోయాడని ఎవరన్నా చెబితేనేగాని తెలియదు. అంత చక్కగా మామూలు మనిషి అయ్యింది. మీరు పరోపకారం, సానుభూతి అంటూ పరాయి

ఆడదాని గురించి ఆలోచిస్తున్నారు గాని మీ భార్య గురించి ఎంత ఆలోచిస్తున్నారు? ఆవిడ దుఃఖం పోగొట్టారు. కాని నాకు దుఃఖం మిగిల్చారు. మనిద్దరం కలసి భోజనం చేసి, సినిమా చూసి ఎన్నాళ్ళు అయ్యింది. నా సంగతి సరే, మీరీ పాపని కూడా పట్టించుకోవటం లేదు. ఇదివరకు మీరు దీన్ని స్కూటర్ మీద స్కూలుకి దింపేవారే. కాని ఇప్పుడు ఆఫీసు పన్లు చాలా ఉన్నాయంటూ పెంద్రాళ వెళ్ళిపోతున్నారు. కాని మీరు వెళ్ళేది ఆఫీసుకి కాదు. ఆవిడ ఇంటికి. ఆవిడ్ని ఆఫీసుకి మీ స్కూటర్ మీద తీసుకెళ్ళి దింపి, అట్నుంచి మీరు మీ ఆఫీసుకి వెడుతున్నారు. సాయంత్రం డిటో. సాయంత్రం మీ ఆఫీసు అవగానే ఆవిడ ఆఫీసుకి వెళ్ళి ఆవిడ్ని వాళ్ళ ఇంటిదగ్గర దింపి మీరు చాలా సేపు అక్కడే కాలక్షేపం చేస్తున్నారు. భర్తలేని సమయంలో నా చిన్ననాటి మిత్రుడు గోవర్ధన్ నాకోసం రావటం సభ్యత కాదని మీరు అంటున్నారు. అదిసరే, కాని భర్త పోయిన ఆడదానితో సినిమాలు, షికార్లు, స్కూటర్ మీద లిఫ్టులు, మధ్యలో పూలదుకాణం దగ్గర బండి ఆపి మీరు పూలదండలు ఆవిడకి కొనియ్యటం, ఆవిడ అక్కడే జడలో పెట్టుకోవటం, అర్థరాత్రి దాకా ఆవిడతో కాలక్షేపం, కలిసి భోజనాలు... ఇవన్నీ సంస్కారవంతమైన పన్లా? మరణించిన స్నేహితుడిపై గౌరవం కిందకే వస్తాయా?"

గౌరీనాథ్ ఖంగుతిన్నట్లు చూశాడు. మాట పెగల్లేదు.

"ఎవరో పరాయి ఆడదాని దుఃఖం పోగొట్టటానికి మీరు తాపత్రయ పడుతున్నారు. కాని కట్టుకున్న భార్యకి మీరు ఎంత ఆనందం ఇస్తున్నారు?"

"................."

"మీ మిత్రుడు సత్యమూర్తి చచ్చిపోవటం వల్ల ఆవిడకి లోటు వచ్చింది. కాని నా భర్త బ్రతికి ఉండగానే నాకు ఆనందానికి లోటు వచ్చింది కదా? మీరు ఏ లోటు తీర్చటానికి మీ మిత్రుడు భార్య శ్రీలత ఇంటికి వెడుతున్నారో. తండ్రిపోయిన ఆవిడ మూడేళ్ళ పసివాడికి, ఎలాంటి ప్రేమ అందిస్తున్నారో, అలాంటి లోటు నాకు, నా నాలుగేళ్ళ కూతురికి కూడా చోటు చేసుకుంది. ఆ లోటు భర్తీ చేసి మా ఇద్దరికి కాలక్షేపం ఇవ్వటానికి, నా ఫ్రెండ్ గోవర్ధన్ మన ఇంటికి వస్తున్నాడు. అది కుసంస్కారం ఎలా అవుతుంది? మీరు చేస్తే మంచి పని, పరాయివాడు చేస్తే తప్పుడు పనినా? అంతేకాదు. మీరు లేని సమయం చూసి గోవర్ధన్ రావటం లేదు. అతను ఎప్పుడు మనింటికి వచ్చినా మీరు ఉండటం లేదు. ఉదయాన పాప స్కూలుకి వెళ్లే సమయం కంటే ముందే మీరు వెళ్ళిపోతున్నారు. ఎపుడో అర్థరాత్రి తిరిగి వస్తున్నారు. నా సంసారం గురించి నేను దిగులుపడడం చూసి ఏ అఘాయిత్యం చేసుకుంటానోనని నా ఫ్రెండ్ నాకు ధైర్యం చెప్పటానికి వస్తున్నాడు" అంది.

"..........." గౌరీనాథ్ నిరుత్తరుడయ్యాడు. పిచ్చివాడిలా ఆమెకేసి చూశాడు.

పైకి విసిరిన రాయి తిరిగి తన తలే పగులగొట్టిందా?

✳ ✳

తల దించుకుని దీక్షగా కథ రాస్తున్న ప్రముఖ రచయిత్రి వినిత చేతిలో కలం పక్కనపెట్టి విశ్రాంతిగా కుర్చీ వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది.

పూర్వం కాకి, మాంసం ముక్క కథలో అయితే నక్కబావ పాట పాడమనగానే, కాకి నోరు తెరిచి పాట పాడితే మాంసం ముక్క కింద పడింది. నక్క ఆ మాంసం ముక్క నోట కరచుకుని పారిపోతుంది. కాకి ఏడుస్తుంది.

కాని ఇప్పుడు అదే కథని చెప్పాలంటే, కాకి తెలివిగా నక్క దొంగబుద్ధిని ముందే కనిపెట్టుకుని, మాంసం ముక్కని కాలకింద తొక్కిపెట్టి, నోరు తెరిచి పాట పాడుతుంది. తరువాత మాంసం ముక్క నోట కరుచుకుని దాని గూటికే ఎగిరి, హాయిగా తింటుంది అని చెప్పాలి. ఎందుకంటే కాలం మారింది. కాలంతోపాటు సాహిత్యం మారాలికదా?

✳ ✳

"తప్పు" కథ కూడా అలాగే వ్రాయాలి.

కథని రెండు భాగాలుగా ప్లాన్ చేసింది వినిత.

మొదటి భాగం పూర్తి అయ్యింది.

భర్త 'తప్పు' చేస్తుంటే, అతనికి తెలిసిరావాలని, భార్య అలాంటి తప్పే చేస్తుంది.

కాని రెండో భాగంలో కథ మారుతుంది. భర్తకి తెలిసిరావటంకోసం తన చిన్ననాటి మిత్రుడితో కలిసి నాటకం ఆడుతుంది సరిత. అలా కథని చిత్రించాలి. గౌరీనాథ్ సరిత తప్పు చేస్తుంది అనుకుంటాడు ముందు. అయితే సరిత, స్నేహితుడు గోవర్ధన్ వాళ్ళు ఆడేనాటకం గురించి మాట్లాడుకోవటం అనుకోకుండా ఇంటికి వచ్చిన గౌరీనాథ్ వింటాడు. అతని మనసు పశ్చాత్తాపపడుతుంది. భార్యని అనుమానించినందుకు సిగ్గుపడుతాడు. తనకి కనువిప్పు కావటం కోసమే సరిత అలా ప్రవర్తించిందని తెలుసుకుని ఆనందపడతాడు. తన 'తప్పు' సవరించుకోవాలని, ఇక శ్రీలత ఇంటికి వెళ్ళకూడదని నిర్ణయించుకుంటాడు. అలా వెళ్ళటం స్నేహితుడికి ద్రోహం చెయ్యటమే అవుతుందని కూడా అనుకుంటాడు."

"ఠంగ్... ఠంగ్... ఠం........"

గడియారం పన్నెండు గంటలు కొడుతుంది.

అర్ధరాత్రి అయ్యింది.

అలసటగా కుర్చీలోంచి లేచి రైటింగ్ పాడ్‌ని జాగ్రత్తగా అల్మారాలో పెట్టి గదిలో లైటార్పి విశ్రాంతిగా మంచంలో వాలింది.

రేపు రూమ్‌బోయ్ కథ తాలూకు రెండో భాగాన్ని ఊహించుకుంటూ అలసటగా కళ్ళు మూసుకుంది ప్రముఖ రచయిత్రి వినిత!. ✳

## అంత లేదు

**స**న్నీడియోల్ మార్కెట్ ఎప్పుడూ నార్మల్‌గా వుంటుంది. ఈ మధ్య ఒక ఇంటర్వ్యూలో మీ పప్పా (నాన్న) ధర్మేంద్రలా సంచలన చిత్రాల్లో నటించి... ఆ స్టార్‌డమ్‌ని ఎందుకు సాధించలేక పోయారు? అని అడిగితే!

నాన్నగారు చేసిన రిస్క్ నేను చేయలేను. రిస్క్ అంటే మెంటల్‌గా గాని.... ఫిజికల్‌గా గాని నాన్నగారికి కోపం ఎక్కువ.... అలాగని చప్పున చల్లారిపోతుంది వెంటనే, పసిపిల్లాడిలా నవ్వుతూ కలిసిపోతారు. అంత విశాల హృదయం నాకు లేదు... నాకు సెటిల్డ్ ఎమోషన్స్ వున్నాయ్! అంటాడు సన్నిడియోల్.

